పథకాల లబ్ధి పొందని కుటుంబం లేదు

- టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సిఫారసు ఉన్నవారికే..
- నేడు అర్హత ఉన్న అందరికీ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో అన్ని వర్గాల వారి అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరులోని 16, 17 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధిని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. వార్డుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రఘురామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హత ఉంటే చాలు పథకాలను అందిస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలలో 95 శాతం నెరవేర్చారని తెలిపారు. ఏ ముఖ్యమంత్రి రాష్ట్ర చరిత్రలో ఇలా చేయలేదని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాల వల్ల లబ్ధి పొందని కుటుంబం లేదన్నారు. టీడీపీ హయాంలో ఇల్లు కానీ, పింఛన్ కానీ కావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసు ఉండాల్సిందేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ అవసరం లేదని చెప్పారు. తమ ప్రభుత్వ పనితీరుకు, టీడీపీ పాలనకు తేడా గమనించాలని కోరారు.

సమస్యలపై స్పందన

పట్టణంలోని 16, 17 వార్డుల్లో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందించారు. స్థానిక ఓంశాంతి నగర్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్లు కావాలని కోరగా, వెంటనే మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కరణం వీధి, నాయీబ్రాహ్మణ వీధి, పొలిమేర వీధిలో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలు చెప్పగా, కొత్త సీసీ రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. రెండు వార్డుల్లో పలువురు పక్కా ఇళ్లు కావాలని కోరగా మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి రాయుడు, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, భరత్‌కుమార్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ట్రాక్టర్ గౌస్, కందనూరు షరీఫ్, భూమిరెడ్డి సుబ్బరాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, గోశెట్టి లక్షుమయ్య, రవి, 10, 14 వార్డుల ఇన్‌చార్జిలు చంద్ర ఓబులరెడ్డి, ఖాదర్, పిల్లి నాగయ్య, శ్రీనురావు, కరిడి రమణమూర్తి, వీరభద్రుడు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీనారాయణహోమం, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు శ్రీవారి కల్యాణం

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9:30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, సాయంత్రం గరుడ వాహనసేవ ఉంటుందని తెలిపారు.

త్వరలో 'రాచమల్లు వారి రాజన్న భోజనం' ప్రారంభం



రాచమల్లు వారి రాజన్న భోజనం వంట శాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో రాచమల్లు వారి రాజన్న ఉచిత భోజనం కార్యక్రమాన్ని త్వరలో మంత్రులు ఆదిమూలపు సురేష్, ఆర్‌కే రోజా, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్మికులు, శ్రామికులు, డ్రైవర్లు, పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రధానంగా ఈ ఉచిత భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఎదురుగా రోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. సుమారు రోజూ 2వేల మంది భోజనానికి వస్తారని అంచనా వేశామన్నారు. రోజూ ఇందు కోసం ప్రత్యేకంగా మెనూను తయారు చేశామని, అన్నం పప్పు, చెట్నీతోపాటు శనివారం ప్రత్యేక భోజనం ఉంటుందన్నారు. రోజుకు ఇందు కోసం రూ.70వేలు వరకు, నెలకు రూ.25లక్షలు, ఏడాదికి రూ.1.50 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. రోజూ వ్యవసాయ మార్కెట్‌యార్డులోని వంటశాలలో తయారు చేసిన వంటలను వ్యాన్‌లో భోజనశాలకు తీసుకెళ్తామన్నారు. ఇందు కోసం పెద్ద సంఖ్యలో వేతనాలు ఇచ్చి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. బుధవారం వంటశాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, నాలుగో వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు మల్లి, రాజుపాళెం మండల గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు అల్లాడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలకు 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



వెంగలాయపల్లెలో విద్యార్థులకు విద్యా కానుకను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రేణుకమ్మ

రాజుపాళెం : మండలంలోని వెంగలాయపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుకను సర్పంచ్ ధనిరెడ్డి రేణుకమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేస్తోందని తెలిపారు. దీంతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. నాణ్యమైన విద్య అందుతోందని.. బాగా చదుకోవాలని సూచించారు.

నేడు చర్చి ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన చర్చి

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని పునీత మదర్‌థెరిసా విచారణ ప్రాంగణంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పునీత పాదువాపురి అంతోని వారి దేవాలయము ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు మదర్‌థెరిసా విచారణ గురువులు ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజు తెలిపారు. మంగళవారం చర్చి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్చి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆర్చి బిషప్ (హైదరాబాద్) మహోఘన కార్డినల్ పూలఅంతోని, కడప మేత్రాసన పీఠాధిపతి గాలిబాలితో పాటు వివిధ విచారణల గురువులు హాజరవుతారని తెలిపారు. భాకరాపేట సమీపంలోని కల్వరికొండ నుంచి పునీత మదర్‌థెరిసా చర్చి వరకు ప్రముఖుల ఊరేగింపు ఉంటుందని, అనంతరం నూతన దేవాలయ ప్రతిష్టాపన చేసి దివ్యబలిపూజ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి నర్రవాడకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : నెల్లూరు జిల్లాలో జరగనున్న నర్రవాడ వెంగమాంబ పేరంటాలు జాతర సందర్భంగా బుధవారం నుంచి గురువారం వరకు రెండు రోజుల పాటు బద్వేలు డిపో నుంచి నర్రవాడకు 10 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు రక్తదాన శిబిరం

బద్వేలు అర్బన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం ఆవశ్యకత తెలిసిన ప్రతిఒక్కరు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

నేడు మెగా రక్తదాన దినోత్సవ శిబిరాలు

కడప రూరల్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం మెగా రక్తదాన దినోత్సవ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన దినోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలను కడపతో పాటు ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యాకానుక పంపిణీ

బి.కోడూరు : మండలంలోని సిరిగిరిపల్లె పాఠశాలలో మంగళవారం ఐత్రంపేట ఎంపీటీసీ గంగిపోగు విజయకుమారి చేతులమీదుగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోని డీసీఎస్‌ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



13వ వార్డులో జేవీకే కిట్లను అందిస్తున్న కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా



32వ వార్డులో జేవీకే కిట్లను అందిస్తున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా తెలిపారు. వార్డు పరిధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం గతంలో ఈ విధంగా పాఠశాలలు తెరిచే నాటికే యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు ఇవ్వలేదన్నారు. జగన్ మంచి పరిపాలనకు ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు.

- 28వ వార్డు పరిధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, రామేశ్వరం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.
- 32వ వార్డులో పూటుకూరు వీరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను అందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవలని కౌన్సిలర్ కోరారు.

ఎంపీడీఓగా రామకృష్ణ



గోపవరం : మండల అభివృద్ధి అధికారిగా రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిప్యుటేషన్‌పై అట్లూరు ఏఓగా పని చేస్తున్న హరినారాయణ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో బద్వేలు ఎంపీడీఓగా పనిచేస్తున్న రామకృష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన అధికారులతో వైఎస్సార్ బీమా, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, నాడు–నేడు పనులు, పాఠశాలల తనిఖీలపై సమీక్ష నిర్వహించారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుభరోసా పడని రైతులకు మరో అవకాశం

గోపవరం : రైతుభరోసా పడని రైతులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. బ్యాంకులో ఆధార్ లింక్ చేసుకోని వారు వెంటనే ఆయా బ్యాంకులకు వెళ్లి లింక్ చేయించుకోవాలన్నారు. ఆధార్ లింక్ చేయించుకున్న రైతులకు తిరిగి వారి ఖాతాలో రైతుభరోసా నగదును జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అదాలత్‌లో ఆరు ఫిర్యాదులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఈఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరులో వ్యవసాయ పంపుసెట్లకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ముగ్గురు రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, అదనంగా విద్యుత్ బిల్లులు వచ్చినట్లు ఫిర్యాదు చేశారు. విద్యుత్ అదాలత్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని ఈఈ తెలిపారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



పెద్దుళ్ళపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దుళ్ళపల్లె, కొండంపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అలాగే సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహదారు నాగార్జున రెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు రామసుబ్బారెడ్డి, మునిరెడ్డి, జయరామిరెడ్డి, ఎంపీటీసీ రామకోటి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, దుగ్గిరెడ్డి, సుబ్బారెడ్డి, శేషారెడ్డి, సచివాలయ జేసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు పి.వెంకటసుబ్బారెడ్డి, రామలక్ష్మిరెడ్డి, పోలిరెడ్డి, బ్రహ్మరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో విత్తనాలు



జీలుగలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

చాపాడు : గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలో మంగళవారం నుంచి జీలుగల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గతంలో విత్తనాలు, ఎరువుల కోసం క్యూలో నిలబడి రోజుల తరబడి మండల కేంద్రానికి తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోని రైతులకు అన్ని రకాలైన విత్తనాలు, ఎరువులు ఇబ్బందులు పడకుండా అందుతున్నాయన్నారు. మండల వ్యవసాయాధికారి మ్యాగీ మాట్లాడుతూ మండలానికి 850 క్వింటాళ్ల జీలుగలు, జనుములు మంజూరయ్యాయన్నారు. 50శాతం సబ్సిడీతో రైతులకు ఇస్తున్నామన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రిల్చర్ అసిస్టెంటు గోపీరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వం



జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలను తీసుకువస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందని ఎరుకలపాలెం ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎం.చిన్ని తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదరికం, అసమానతలను అధిగమించడంలో విద్య ముఖ్యపాత్ర పోషిస్తుందని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యను ప్రతిఒక్కరికి అందించేందుకు అమ్మఒడి, నాడు–నేడు, విద్యాదీవెన వంటి పథకాలను ప్రవేశ పెట్టడంతో పాటు జగనన్న విద్యాకానుక పథకాన్ని కూడా తీసుకువచ్చారన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగబసవరాజు, ఉపాధ్యాయులు జయమ్మ, అరుణకుమారి, సంగీత, సుధారాణి పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : అందరూ ఐక్యంగా ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని రూరల్ సీఐ యుగంధర్ తెలిపారు. మండల పరిధిలోని అమృతానగర్‌లో మంగళవారం రాత్రి పోలీసు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాక్షన్, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని కళాజాత బృందం సభ్యులు నాటకం రూపంలో వివరించారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సైబర్ నేరాలు, దిశయాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

బ్రెయాన్ హాస్పిటల్ ప్రారంభం



బ్రెయాన్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న చిత్తా బాలిరెడ్డి

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో పోరుమామిళ్ళలోని మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బ్రెయాన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని వైద్యసేవలను గ్రామాలను విస్తరించాలన్న ఉద్దేశ్యంతో చిత్తా రవిప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో కలసపాడులో మంగళవారం బ్రెయాన్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ హాస్పిటల్‌ను శాంతి ప్రేమ సేవా సమాజం చైర్మన్ చిత్తాబాలిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, చిత్తాగిరి ప్రణీత్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ హాస్పిటల్ సేవలు ప్రతి గ్రామంలోకి వెళ్ళాలన్న ఉద్దేశ్యంతో కలసపాడులో హాస్పిటల్ ప్రారంభించామన్నారు. ఇది విజయవంతమైతే ఇంకా ఎక్కువ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హాస్పిటల్‌లో స్పెషలిస్టు డాక్టర్లతో దంత, ఈఎన్‌టీ, కాన్పులు, ఫిజియో విభాగాల వారు ప్రతి నెల వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సగిలి సుదర్శన్, విశ్రాంత అధ్యాపకులు వీరస్వామి, ఓఎల్ఎఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోగ్యరాణి, పోరుమామిళ్ల సెయింట్ ఆంటోనీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునందరెడ్డి, మేరీ ప్రజ్వలారెడ్డి, పోరుమామిళ్ళ జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, బోర్‌రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నల్లేరు పోలమ్మ

కాశినాయన : ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ నల్లేరుపోలమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యాచారి, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాడిరైతులు పశు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



పశువులకు వైద్య సేవలు చేస్తున్న మునయ్య

ఖాజీపేట : సీజనల్ వ్యాధులు వచ్చే సమయంలో పశువుల ఆరోగ్యం పట్ల పాడిరైతులు జాగ్రత్తగా ఉండాలని ఏటూరు పశువైద్యాధికారి డాక్టర్ మునయ్య రైతులకు సూచించారు. తిప్పాయపల్లె గ్రామంలో పశువైద్య శిబిరాన్ని డాక్టర్ మునయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. అలాగే వైద్యుల సూచనల మేరకు మినరల్ మిక్షర్ టీకాలను అందించారు. పశువుల్లో రోగనిరోధక శక్తిని పెంపెందించాలంటే సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. ఎద లక్షణాలను గమనిస్తూ వచ్చినట్లు గుర్తిస్తే ఆసుపత్రిలో ఎద సూదులు వేయించాలన్నారు. 55 పశువులకు 125 జీవాలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ కొట్టాలు పశువైద్యాధికారి డా.బాబు రాంచంద్ర, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ప్రకాశ్‌తోపాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని చౌకదుకాణాల ద్వారా ప్రతి నెలా బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయ పరిధిలోని భవనంలో మంగళవారం వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల చౌక దుకాణాలకు వెళ్లి స్టాక్‌ను, ఎండీయూ వాహనాల్లో రేషన్ పంపిణీ పరిశీలించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సజావుగా నిర్దేశించిన గడువు లోపు సరుకులను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రోజూ బియ్యం పంపిణీ వివరాలను తమకు తెలపాలని అన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే తనకు ఫోన్ చేయాలని చెప్పారు. కొత్తగా పౌరసరఫరాల శాఖ డీటీగా సుదర్శన్‌ను నియమించినట్లు తెలిపారు. రోజు ఎండీయూలు ఎంత శాతం రేషన్ పంపిణీ చేస్తున్నారో పరిశీలించాలన్నారు. సకాలంలో డీలర్లకు సరుకు తెప్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్‌ఐ నాగమోహన్ రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సాయి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.